హైదరాబాద్‌లో పీబీపార్టనర్స్ ఆఫీస్

హైదరాబాద్, ఆగస్టు 30: పాలసీ బజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్‌కు చెందిన పీబీపార్టనర్స్..తెలంగాణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం వచ్చే రెండు నెలల్లో హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు కస్టమర్ కేర్ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు పీబీపార్టనర్స్ అసోసియేట్ డైరెక్టర్, సేల్స్ హెడ్ అమిత్ భదోరియా తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే రెండేండ్లలో వరంగల్, కరీంనగర్‌తోపాటు వైజాగ్, తిరుపతి, కోయంబత్తూరులలో కార్యాలయాలను తెరువాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో 5,500కి పైగా ఎజెంట్లు ఉన్నారని, వచ్చే రెండేండ్లలో ఈ సంఖ్యను రెండింతలు పెంచుకోనున్నట్లు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా కోటికి పైగా వాహన పాలసీలు విక్రయించినట్లు, దీంట్లో తెలంగాణలో 3 లక్షలు, ఏపీలో 3.5 లక్షలు ఉన్నాయన్నారు.

విస్తారా కనుమరుగు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: చౌక విమానయాన సంస్థ విస్తారా ఎయిర్‌లైన్స్ ఇక కనుమరుగుకాబోతున్నది. విస్తారా బ్రాండ్‌తో నవంబర్ 11న తన చివరి విమాన సర్వీసును నడుపబోతున్నది. టాటా గ్రూపునకు చెందిన ఎయిర్ ఇండియాలో నవంబర్ 12 నుంచి విలీనం కానుండటంతో తన బ్రాండ్ సేవలు నిలిచిపోనున్నాయని తాజాగా వెల్లడించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇక ఎయిర్ ఇండియా-విస్తారా విలీనం కాబోతున్నాయి. టాటా గ్రూపు, సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా గతంలో విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేశాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను టాటా గ్రూపు కొనుగోలు చేయడంతో తన అనుబంధ విమానయాన సంస్థలను ఒక్కతాటిపైకి తేవడానికి ప్రయత్నిస్తున్నది. విలీనం తర్వాత ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా కలిగివుండనున్నది. ఇప్పటికే ఇరు సంస్థలు విమానాలకు సంబంధించి లావాదేవీలు కలిసి నిర్వహిస్తున్నాయని, ముఖ్యంగా ఉద్యోగులు కలిసి పని చేస్తున్నారని ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు.

జీడీపీ డౌన్.. ఇన్‌ఫ్రా స్లో

తొలి త్రైమాసికంలో 15 నెలల కనిష్టానికి వృద్ధిరేటు

- ఈ ఏప్రిల్-జూన్‌లో 6.7 శాతానికే పరిమితం
- జూలైలో 6.1 శాతానికి మందగించిన కీలక రంగాల పనితీరు
- తాజాగా విడుదలైన కేంద్రప్రభుత్వ గణాంకాల్లో తేటతెల్లం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశ ఆర్థిక వ్యవస్థను నిస్తేజం ఆవరించింది. ఓవైపు వృద్ధిరేటు.. మరోవైపు కీలక రంగాల పనితీరు మందగించాయి. శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ 15 నెలల కనిష్టానికి దిగజారినట్టు తేలింది. అలాగే జూలై నెలకుగాను 8 కీలక రంగాల్లో వృద్ధిరేటు 6.1 శాతానికే పరిమితమైనట్టు స్పష్టమైంది.

వ్యవసాయ, సేవా రంగాలు డీలా

వ్యవసాయ, సేవల రంగాల ప్రదర్శన పేలవంగా ఉండటమే ఈ ఏప్రిల్-జూన్‌లో దేశ జీడీపీ వృద్ధిరేటు 5 త్రైమాసికాల కనిష్టాన్ని తాకుతూ 6.7 శాతానికే పరిమితం కావాల్సి వచ్చిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) పేర్కొన్నది. 2023 జనవరి-మార్చిలో దేశ జీడీపీ వృద్ధిరేటు 6.2 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ స్థాయి దరిదాపుల్లోకి ఇప్పుడే గణాంకాలు వెళ్లాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఏప్రిల్-జూన్‌లో 8.2 శాతంగా ఉండటం గమనార్హం. ఈ ఏడాది జనవరి-మార్చిలోనూ 7.8 శాతం వృద్ధి కనిపించింది. దీంతో 3 నెలల్లో జీడీపీ 1 శాతానికిపైగా పడిపోయినట్టైంది.

ఆయా రంగాలవారీగా..

ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రంగ జీవీఏ (గ్రాస్ వాల్యూ ఆడెడ్) 3.7 శాతం నుంచి 2 శాతానికి క్షీణించినట్టు ఎన్ఎస్ఓ తెలియజేసింది. అలాగే ఆర్థిక, నిర్మాణ, ప్రొఫెషనల్ సర్వీసెస్ జీవీఏ కూడా నిరుడు ఏప్రిల్-జూన్‌తో పోల్చితే 12.6 శాతం నుంచి 7.1 శాతానికి దిగజారింది. ట్రేడ్, హోటల్స్, రవాణా, కమ్యూనికేషన్ అండ్ సర్వీసెస్ విభాగాల్లోనూ వృద్ధి 9.7 శాతం నుంచి 5.7 శాతానికి పతనమైంది. ఈ క్రమంలోనే ప్రధానమైన తయారీ రంగ జీవీఏ 2 శాతం పెరిగి 7 శాతానికి పుంజుకున్నా.. మైనింగ్-క్వారీయింగ్, విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సర్వీసుల్లో ఆకర్షణీయ వృద్ధి ఉన్నా ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే ప్రస్తుత ధరల వద్ద ఈసారి జీడీపీ విలువ రూ.77.31 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఓ ప్రకటనలో ఎన్ఎస్ఓ తెలిపింది.

మౌలికం బేజారు

దేశ పారిశ్రామిక ప్రగతికి ప్రామాణికంగా భావించే 8 కీలక రంగాల్లో మందగమనం అలుముకున్నది. గత నెల జూలైలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోని ఉత్పాదకతలో వృద్ధిరేటు 6.1 శాతంగానే ఉన్నది. నిరుడు జూలైలో ఇది 8.5 శాతంగా ఉండటం గమనార్హం. భారతీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉండటం విశేషం. అలాంటిదిప్పుడు ఆయా రంగాల్లో ఉత్పత్తి ఏడాది కాలంలో 2.4 శాతం మేరకు పడిపోయింది. ముడి చమురు ఉత్పత్తి మైనస్ 2.9 శాతంగా, సహజ వాయువు ఉత్పత్తి మైనస్ 1.3 శాతంగా ఉండటం దెబ్బ తీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే బొగ్గు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోనూ ఉత్పాదకత గతంతో పోల్చితే వరుసగా 6.8 శాతం, 7.2 శాతం, 5.5 శాతం, 7 శాతాలకు పడిపోయింది. దీంతో రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల రంగాల్లో 6.6 శాతం, 5.3 శాతం చొప్పున వృద్ధి నమోదైనా ప్రయోజనం లేకపోయింది.

గూగుల్ పేలో కొత్త ఫీచర్లు

- యూపీఐ సర్కిల్ పరిచయం
- ఈరూపీ వోచర్ల జారీ,
- ట్యాప్‌అండ్‌పే పేమెంట్లూ షురూ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రముఖ పేమెంట్స్ యాప్ గూగుల్ పేలో కొత్త ఫీచర్లను తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే శుక్రవారం యూపీఐ సర్కిల్‌సహా మరికొన్నింటిని పరిచయం చేశారు. ముంబైలో 3 రోజులపాటు జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2024 ముగింపు సందర్భంగా ఈ మేరకు గూగుల్ పే నుంచి ప్రకటనలు వచ్చాయి. కాగా, యూపీఐ సర్కిల్‌తో గూగుల్ పే వినియోగదారులు (ప్రైమరీ యూజర్లు) తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను సెకండరీ యూజర్లుగా అనుమతించవచ్చు. దీంతో తమ బ్యాంక్ ఖాతాను లింక్ చేసుకోకుండానే ఇకపై వీరంతా కూడా ప్రైమరీ యూజర్ అకౌంట్ ద్వారానే డిజిటల్ చెల్లింపులను జరుపుకోవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) భాగస్వామ్యంతో దీన్ని తీసుకొచ్చింది. అలాగే ఈ సందర్భంగా యూపీఐ వోచర్స్ (ఈరూపీ)నూ గూగుల్ పే ప్రారంభించింది. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రస్తుత యూపీఐ వినియోగదారులు వీటిని జారీ చేయవచ్చు. అంతేగాక రూపే కార్డుల కోసం ట్యాప్‌అండ్‌పే చెల్లింపుల సౌకర్యాన్నీ కల్పించింది. ఈ పేమెంట్స్ కోసం రూపే కార్డుదారులు తమ మొబైల్ ఫోన్లను కార్డులతో అనుసంధానించుకోవాల్సి ఉంటుంది. యూపీఐ లైట్ కోసం ఆటోపే ఆప్షన్, యాప్‌పై క్లిక్‌పే క్యూఆర్ కోసం సపోర్ట్‌నూ అందిస్తున్నది. కాగా, ఆర్థిక వ్యవస్థలో డిజిటలైజేషన్‌ను మరింత విస్తృతపర్చడానికి ఈ నెలలో జరిగిన ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన అనుమతుల మేరకే ఈ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి.

బ్రోకర్లపై సెబీ కొరడా

46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీల రిజిస్ట్రేషన్లు రద్దు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. 46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీ సంస్థలపై కొరడా ఝుళిపించింది. నిబంధనల మేరకు లేని 39 స్టాక్ బ్రోకర్లు, 7 కమోడిటీ బ్రోకర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను శుక్రవారం రద్దు చేసింది. అలాగే 22 డిపాజిటరీ పార్టిసిపెంట్లు రిజిస్ట్రేషన్లనూ క్యాన్సిల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నది. రిజిస్ట్రేషన్లు రద్దైనా.. స్టాక్ లేదా కమోడిటీ బ్రోకర్లుగా, డిపాజిటరీ పార్టిసిపెంట్లుగా గతంలో తీసుకున్న చర్యలకు, వైఫల్యాలకు ఇకపైనా వారు బాధ్యులేనని వేర్వేరుగా ఇచ్చిన తాజా ఆదేశాల్లో సెబీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెబీకి బాకీపడిన వడ్డీలు, ఫీజులు, ఇతరత్రా బకాయిలను చెల్లించాల్సిందేనన్నది.

ఆర్థికాభివృద్ధిలో విదేశీ వాణిజ్యం కీలకం

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డీజీ శశాంక్ గోయల్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విదేశీ వాణిజ్యం, పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) కేంద్రం డైరెక్టర్ జనరల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ చెప్పారు. విదేశీ వాణిజ్యం కేవలం జీడీపీని మాత్రమే కాదు.. ఉద్యోగావకాశాలు, వేతనాలను కూడా పెంచుతుందని పేర్కొన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ఐటెక్ విభాగం సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తల శిక్షణా కోర్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోయల్ మాట్లాడుతూ.. ఈజిప్ట్, భారత్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు చారిత్రాత్మకంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు, వారి దేశాభివృద్ధికి దోహదపడేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందిస్తాయని చెప్పారు. అనంతరం ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు కోర్సు పూర్తి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రవులపాటి, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

10 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపర్లలో ఖుషి

ముంబై, ఆగస్టు 30: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. రోజుకొక చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న సూచీలు శుక్రవారం మరో మైలురాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల జోరు కొనసాగుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఫలితంగా ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 231.16 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయి 82,365.77 వద్ద ముగిసింది. వారాంతం ట్రేడింగ్‌లో 2,228 సూచీలు లాభపడగా, 1,701 సూచీలు నష్టపోయాయి. మరో సూచీ నిఫ్టీ సైతం ఉన్నత శిఖరానికి చేరుకున్నది. వరుసగా 12 రోజులుగా పెరుగుతూ వచ్చిన నిఫ్టీ శుక్రవారం సైతం 83.95 పాయింట్లు ఎగబాకి 25,235.90 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపరుల సంపద రూ.10 లక్షల కోట్లు పెరిగింది. గత తొమ్మిది సెషన్లలో సెన్సెక్స్ 1,941 పాయింట్లు లాభపడటంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.10,00,028 కోట్లు పెరిగి రూ. 4,64,39,993.77 కోట్లు (5.54 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వచ్చే నెలలోనే ఫెడ్ వడ్డీరేట్లను తగ్గించనుండటంతో గ్లోబల్ మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిశాయి..దీంతో దేశీయ సూచీలు కూడా పరుగులు పెట్టాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



- మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు(1.57 శాతం), నిఫ్టీ 412.75 పాయింట్లు(1.66 శాతం) లాభపడ్డాయి. గత తొమ్మిది రోజుల్లో సెన్సెక్స్ 1,941(2.41 శాతం), నిఫ్టీ 1,097 పాయింట్లు(4.54 శాతం) చొప్పున పెరిగాయి.
- వారాంతం ట్రేడింగ్‌లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఎయిర్‌టెల్, సన్ ఫార్మా షేర్లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి. దీంతోపాటు టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, నెస్లెలు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టాటా మోటర్స్, రిలయన్స్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతిలు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ 1.88 శాతం బలపడగా, హెల్త్‌కేర్ 1.41 శాతం, యుటిలిటీస్, కమోడిటీస్, టెక్, సేవల రంగ షేర్లు కదంతొక్కాయి.

‘తలసేమియాపై అవగాహన అవసరం’

మాట్లాడుతున్న ఖమ్మం అడిషనల్ డీసీపీ సీటీసీ విజయబాబు

ఖమ్మం, ఆగస్టు 30: దేశంలో పోలియో నిర్మూలన కోసం అవగాహన కల్పించిన విధంగానే తలసేమియా వ్యాధిపై కూడా అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అడిషనల్ డీసీపీ సీటీసీ విజయబాబు, డీసీహెచ్ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. దీనికోసం సమాజమంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలో శుక్రవారం జరిగిన సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 14వ వార్షికోత్సవంలో వారు మాట్లాడారు. తలసేమియా వ్యాధి నిర్మూలనకు, చిన్నారులను రక్షణకు సంస్థ సభ్యులు పడుతున్న శ్రమ ఎనలేనిదని అన్నారు. అందరమూ చేయిచేయీ కలిపితే తలసేమియా వ్యాధిని కూడా అరికట్టవచ్చునని అన్నారు. ఏఆర్ ఏసీపీ ఎన్.నర్సయ్య, వైద్యులు డాక్టర్ నారాయణమూర్తి, రాంప్రసాద్, గణేశ్, అనురాధ, సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ బాధ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం విజయవంతం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న అడపా అప్పారావు

ఖమ్మం/ వైరా టౌన్, ఆగస్టు 30: వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం విజయవంతమైంది. వైరాతోపాటు బోనకల్లు, తల్లాడ, కొణిజర్ల మండలాల నుంచి పలువురు ఈ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. హైదరాబాద్ కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, ఖమ్మం ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్, వైరా బోడేపూడి వైద్యశిబిరం, వైరా కమ్మ జనసేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ కేంద్రం వైద్యులు, అదే హాస్పిటల్‌కు చెందిన సంచార వ్యాధి నిర్ధారణ వెహికిల్ సిబ్బంది హాజరై నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, వైద్యులు మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై గ్రామీణులకు అవగాహన ఉండడం లేదని, దీంతో వ్యాధి వివిధ దశలు దాటిన అనంతరం గుర్తిస్తున్న అనేకమంది ఆ తర్వాత ఆసుపత్రులకు వస్తున్నారని అన్నారు.

సీపీని కలిసిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్

సీపీ సునీల్‌దత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రిజర్వు ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

మామిళ్లగూడెం, ఆగస్టు 30: బదిలీలో భాగంగా ఖమ్మం పోలీసు కమిషనరేట్‌కు వచ్చిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు.. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలోని వెల్ఫేర్ సెక్షన్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ముగ్గురు మంత్రులుండీ ఏం ప్రయోజనం?

- సమస్యలతో కునారిల్లుతున్న పెద్దాసుపత్రిని పట్టించుకోరా?
- జిల్లా వైద్యశాల ఎదుట పీవైఎల్, పీవోడబ్ల్యూ నేతల ధర్నా

పెద్దాసుపత్రి ఎంసీహెచ్ భవనం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

ఖమ్మం సిటీ, ఆగస్టు 30: ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా ఏం ప్రయోజనం? సమస్యలతో కునారిల్లుతున్న పెద్దాసుపత్రిని పట్టించుకోరా? నిరుపేదల ఆరోగ్యం పట్ల ఏమాత్రమూ శ్రద్ధ చూపరా?' అంటూ పీవైఎల్, పీవోడబ్ల్యూ నేతలు విమర్శించారు. జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఎంసీహెచ్ ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు సీహెచ్ శిరోమణి, మందా సురేశ్ మాట్లాడారు. ఖమ్మం పెద్దాసుపత్రి నెలల తరబడి సమస్యలతో కునారిల్లుతోందని అన్నారు. జనరల్ ఆసుపత్రి, మాతా, శిశు సంరక్షణ కేంద్రానికి నాలుగు వైపులా శానిటరీ పైపులు లీక్ అయి, మల మూత్రాలు గోడల ఉంటున్నాయని అన్నారు. లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్, మొదటి రెండో అంతస్తుల్లో మురుగుదొడ్లు కంపు కొడుతున్నాయని అన్నారు. ఈ దుర్గంధం భరించలేక మెయిన్ గేట్ మూశారు తప్ప సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. రోగాలు నయం చేసుకునేందుకు వచ్చే కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా సంఘాల నాయకులు ఆవుల మంగతాయి, ఝాన్సీ, శోభ, భరత్, చందు, రవీందర్, అశోక్, జడ మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, చందు, వనిత, సింధు, అంజలి, సత్తార్ పాల్గొన్నారు.

మోటార్ల దొంగల అరెస్టు

చోరీకు గురైన మోటార్లు, టైర్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

పెనుబల్లి, ఆగస్టు 30 : కొంతకాలంగా పెనుబల్లి, వేంసూరు మండల పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను వీఎం.బంజర పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఏసీపీ అన్నిశెట్టి రఘు విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని సూరయ్యబంజరతండాకు చెందిన ఇద్దరు మైనర్లు చెడు అలవాట్లకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలని ఆలోచనలోపడ్డారు. అదేగ్రామానికి చెందిన తేలోతు రవి, కొర్రా పిచ్చా, కేలోతు టక్రియ, కేలోతు శ్రీహరి, భూక్యా గోపాలస్వామి, వాంకుడోతు గోపాలకృష్ణ, భూక్యా రవీంద్ర బాబు, తెల్లయ్య వాంకుడోతు ఉపేంద్ర ఇద్దరు మైనర్లను ఇటీవల మీరు బాగా ఎంజాయ్ చేస్తున్నారు మీకు డబ్బులు ఎక్కడివి అని ప్రశ్నించగా దొంగతనానికి పాల్పడుతూ డబ్బు సంపాదిస్తున్నాం తెలిపారు. దీంతో సునాయసంగా డబ్బు వస్తుందనే ఆశతో పైన తెలిపిన 9 మందికి కూడా మీతో మమ్మల్ని కలుపుకోండి అనడంతో వీరందరూ కలిసి మండలంలోని చుట్టుపక్కల గ్రామాలు, వేంసూరు మండలంలోని రాజుగూడెంలో పంట కాలువలపై ఉన్న మోటార్లు, విద్యుత్ కేబుల్, ట్రాక్టర్ చింతకాయలు, ట్రాక్టర్ టైర్లు, బ్యాటరీలు దొంగిలించడం ప్రారంభించారు. వాటిని తక్కువ ధరకు అమ్మి జల్సాలు చేస్తూ మోటార్లలో ఒక మోటారును విక్రయించేందుకు ప్రయత్నం చేయగా హెచ్‌పీ పెంట్రోల్ బంక్ వద్ద ఎస్సై వెంకటేశ్, సిబ్బందితో పట్టుకున్నారు. దీంతో వీరు పైన తెలిపిన వస్తువులను వివిధ గ్రామాలకు చెందిన భూక్యా వాల్యా, బానోత్ రామకృష్ణ, భూక్యా బాలాజీ, గుగులోతు మురళీలకు విక్రయించామని తెలిపారు. దీంతో పైన తెలిపిన వస్తువులన్నింటినీ రికవరీ చేసి చోరీలకు పాల్పడిన వ్యక్తులను, అట్టి వస్తువులను కొనుగోలు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందన్నారు. రికవరికీ కృషిచేసిన సిబ్బంది అభినందించారు. సమావేశంలో సీఐ ముక్తి లింగయ్య, ఎస్సై వెంకటేశ్ ఉన్నారు.

మద్దులపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారు

నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ సెక్రటరీ, సిబ్బంది

ఖమ్మం రూరల్, ఆగస్టు 30 : మండలంలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గం ఖరారు అయ్యింది. ఇందుకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బైరు హరినాథబాబు, వైస్ చైర్మన్‌గా వనవాసం నరేందర్ రెడ్డి ఎంపికయ్యారు. వీరితో పాటు డైరెక్టర్లుగా ముత్యం క్రిష్ణారావు, కర్లపుడి భద్రాకాళి, తేజావత్ పంతుల్‌నాయక్, ఉప్పగుండ్ల ప్రసాద్, వంగూరి రవి, దారావత్‌బాబు, నల్లమల ప్రతాప్, జడల నగేష్, నంద్యాల శ్యాంసుందర్‌రెడ్డి, బానోత్ హుస్సేన్, కన్నెటి జ్యోతి, పాటిబండ్ల శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. వీరితోపాటు బీరోలు సొసైటీ చైర్మన్,జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి,కూసుమంచి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, ఐసీడీఎస్ సీడీపీఓ, మద్దులపల్లి సర్పంచ్ సైతం డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. జీఓ విడుదల అయిన నాటి నుంచి రెండు సంవత్సరాల పాటు నూతన పాలకవర్గం గడువు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చైర్మన్‌గా ఎంపికైన హరినాథ్‌బాబును శుక్రవారం మద్దులపల్లి మార్కెట్ కమిటీ సెక్రటరీ పీ వీరాంజనేయులు సత్కరించారు.

‘రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి’

పెసలను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 30: రైతులు పండించిన ప్రతి పెసర గింజనూ ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని అపరాల యార్డును సంఘం బాధ్యులు శుక్రవారం సందర్శించారు. పంట ఉత్పత్తులను పరిశీలించారు. గిట్టుబాటు ధర గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు మలీదు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులు పండించిన పెసలను ఎలాంటి కొర్రీలూ పెట్టకుండా మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు మార్కెట్‌లో సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. సంఘం నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు, కేలోత్ లక్ష్మణ్, నారపోగు నాగయ్య పాల్గొన్నారు.

బార్ యజమానికి రూ.2 వేల జరిమానా

ప్లాస్టిక్ గ్లాసులు వినియోగిస్తూ వాటిని కాలువలో వేస్తున్నందుకు చర్య

డంపింగ్ యార్డులో రోడ్డును పూర్తి చేయాలి: కేఎంసీ కమిషనర్ అభిషేక్

ఖమ్మం, ఆగస్టు 30: ఖమ్మంలోని 37, 45 డివిజన్లలోని వాణిజ్య ప్రాంతాల్లో కేఎంసీ కమిషనర్ అభిషేక్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా చేసిన తనిఖీల్లో ప్లాస్టిక్ గ్లాసులు వినియోగిస్తున్న క్రిస్టల్ బార్ యజమానికి రూ.2 వేల జరిమానా విధించారు. అలాగే 'వాణిజ్య ప్రాంతాల నుంచి శానిటేషన్ సిబ్బంది చెత్తను సేకరిస్తున్నారా? లేదా?, ఈ ప్రదేశాలను ఎప్పుడు శుభ్రం చేస్తున్నారు?' అనే అంశాల గురించి ఆరా తీశారు. అనంతరం వినోద థియేట